సామాన్యుడి ఆయుధం

# తెలంగాణ ప్రభ

గురువారం, మే 30, 2024

డిజిటల్



**ఢిల్లీ :** ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులోఎమ్మెల్సీ కవితను కష్టాలు వెంటాడుతున్నాయి. ఓవైపు బెయిల్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నా ఇప్పటివరకు ఉపశమనం కలగకపోవడంతో కవిత తీహార్ జైలులోనే ఉన్నారు. దేశ వ్యాప్తంగా పెను సంచలనంగా మారిన ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కవితపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాఖలు చేసిన అనుబంధ ఛార్జిషీట్‌పై రౌస్ అవెన్యూ కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. కవితపై దాఖలైన ఛార్జిషీట్‌ను కోర్టు పరిగణలోకి తీసుకోవటమే కాకుండా.. జూన్ 3వ తేదీన ఛార్జిషీట్‌లో పేర్కొన్న నిందితులందరూ కోర్టు ఎదుట హాజరు కావాలంటూ సమన్లు జారీ చేసింది. దీంతో వచ్చే నెల 3న కవితను జైలు అధికారులు కోర్టులో ప్రవేశ పెట్టనున్నారు.

**ఈడీ వాదన..**


విచారణకు తగిన సాక్ష్యాలు ఉన్నాయంటూ న్యాయస్థానంలో ఈడీ చేసిన వాదనలను విన్న ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా.. తీర్పును రిజర్వ్ చేశారు. బుధవారం ఈడీ ఛార్జిషీట్‌ను పరిగణలోకి తీసుకుంటున్నట్లు న్యాయమూర్తి ప్రకటించారు. మరోవైపు కవిత బెయిల్ పిటిషన్లపై ఢిల్లీ హైకోర్టులో మంగళవారం వాదనలు పూర్తయ్యాయి. ఇరువైపుల వాదనలు విన్న హైకోర్డు జడ్జి స్వర్ణకాంతశర్మ తీర్పును రిజర్వు చేశారు.

**జూన్3న కోర్టుకు కవిత..**

రౌస్ అవెన్యూ కోర్టు ఈడీ దాఖలు చేసిన అనుబంధ ఛార్జిషీట్‌ను పరిగణలోకి తీసుకుని.. నిందితులుగా ఉన్న వారందరినీ విచారణకు పిలవడంతో ఈకేసు మరెన్ని మలుపులు తిరుగుతుందో వేచి చూడాలి. కోర్టు ఆదేశాలతో కవితతో సహా నిందితులంతా కోర్టులో హాజరుకావాల్సి ఉంటుంది. మరోవైపు జూన్4న ఎన్నికల ఫలితాలు వెలువడనున్న విషయం తెలిసిందే.

- ఈడీ చార్జిషీట్‌పై రౌస్ అవెన్యూ కోర్టు సంచలన నిర్ణయం..
- జూన్ 3న నిందితులందరూ హాజరు కావాలంటూ సమన్లు

# కవితకు మరో షాక్!



దుబ్బాక చేనేత ఇక్కత్‌వస్త్రానికి అరుదైన గౌరవం దక్కింది. గత ఆదివారం సిద్దిపేట జిల్లా దుబ్బాకలో నేసిన వస్త్రాన్ని ప్రత్యేకంగా తీసుకెళ్లి బాలరాముడికి అలంకరించారు. ఐదు చేనేత మగ్గాలపై ఐదుగురు కార్మికులు ఈ లెనిన్ వస్త్రాన్ని బాల రాముడి కోసం గులాబీ రంగులో ఉన్న దారంతో తయారు చేశారు. ఇక ఢిల్లీలో కేంద్ర చేనేత, జౌళి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 75 చీరల ప్రదర్శన ఏర్పాటు చేశారు. అందులో దుబ్బాక చేనేత చీర ఎంపికైనట్లు నిర్వాహకులు వెల్లడించారు. బాలరాముడిని రోజుకో రూపంలో నిర్వాహకులు అలంకరిస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తున్నారు.

- తెలంగాణ ప్రభ, దుబ్బాక



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- సర్కార్‌పై ఎక్స్ (ట్విటర్) వేదికగా మండిపడిన మాజీ మంత్రి
- కాంగ్రెస్ రైతులను విస్మరించింది

# ప్రభుత్వం ఉన్నట్టా..? లేనట్టా..?

2 లో



# సద్గుణాచారికి విశ్వకర్మ లెజెండరి అవార్డు

**తెలంగాణ ప్రభ, (సిరిసిల్ల) :** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన విశ్వబ్రాహ్మణ పురోహిత సంఘం జిల్లా అధ్యక్షుడు రాజూరి సద్గుణాచారికి వాస్తు జ్యోతిష్య రంగంలో గత 30 సంవత్సరాలుగా ఆయన చేస్తున్న కృషిని గుర్తించి విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ వారు 'విశ్వకర్మ లెజెండరీ–2024' పురస్కారాన్ని హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన పురస్కార సభలో అందజేశారు.

రాజూరి సద్గుణాచారి వంశపారంపర్యంగా వస్తున్న కార్పెంటర్ కులవృత్తిని చేస్తూ వంశపారంపర్యంగా వస్తున్న పౌరోహిత్యాన్ని ఆయన తండ్రి నుంచి అభ్యసించారు. గత 30 సంవత్సరాలుగా సేవలనందిస్తున్నారు. పౌరోహిత్యమే కాకుండా వాస్తు జ్యోతిష్య శాస్త్రంలో మంచిపట్టు సాధించారు. ఆయన సేవలు చుట్టూ 5మండలాలకు అందుతున్నాయి . గ్రామస్థాయిలోనే కాకుండా జిల్లాస్థాయిలో ఆయన విశ్వబ్రాహ్మణ పురోహిత సంఘం జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఇటు సాంప్రదాయకంగా వస్తున్న ధార్మిక, ఆధ్యాత్మిక సేవతో పాటుగా సాంఘిక సేవలో కూడా ఆయన తమదైన గుర్తింపును తెచ్చుకున్నారు. కార్యక్రమానికి శ్రీశ్రీ జగద్గురు శ్రీకాంతేంద్ర స్వామి, స్థపతి, పద్మశ్రీ అవార్డు గ్రహీత బ్రహ్మశ్రీ వేలు ఆనందాచారి. వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ విశ్వనాథుల పుష్పగిరి, తల్లోజు ఆచారి వి.లక్ష్మీనారాయణ, దార్ల కాళిదాస్, డా.నీలిమ, తాటికొండ రంగబాబు, అన్నబీమోజు జితేంద్రచారి, బ్రహ్మశ్రీ కొండపి గణేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సామాన్యుడి ఆయుధం
తెలంగాణ ప్రభ
WANTED
సమాజంపై అవగాహన, బాధ్యత కలిగి నిజాన్ని నిర్భయంగా రాయగలిగి, మంచికోసం పని చేయగలననే నమ్మకం ఉన్న ప్రతి ఒక్క రిపోర్టర్‌కి
'తెలంగాణ ప్రభ డిజిటల్ పత్రిక'
ఆహ్వానం పలుకుతుంది. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం.. కొత్త వారికి అవకాశం కల్పిస్తున్నది.
ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి
సెల్ : 99854 44342

# మున్నూరుకాపు సంఘం ఎన్నికలు నిర్వహిస్తాం

## రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్


**తెలంగాణ ప్రభ (కోరుట్ల) :** ప్రజాస్వామ్య బద్ధంగా మున్నూరుకాపు సంఘం ఎన్నికలు నిర్వహిస్తామని తెలంగాణ మున్నూరు కాపు సంఘము రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో జిల్లా మున్నూరు కాపు మండల, గ్రామ సంఘాల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా దేవయ్య పటేల్ హాజరు కాగా, జిల్లా అధ్యక్షుడు బాధినేని రాజేందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా దేవయ్య మాట్లాడుతూ రాష్ట్ర సంఘ అనుమతి లేకుండా వొడ్నాల రాజశేఖర్ అనే వ్యక్తి తనకు తానే జిల్లా అధ్యక్షుడని, కార్యదర్శి రమణ అని ప్రకటించడాన్ని ఖండిస్తూ ఆ కార్యవర్గం చెల్లదన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికల నిర్వహణకు కమిటీని ప్రకటించారు. కొత్త బాడీ ఎన్నికయ్యేంత వరకు జిల్లా అధ్యక్షుడిగా బాధినేని రాజేందర్, ప్రధాన కార్యదర్శి బండారి రాజ్‌కుమార్ కార్యవర్గమే కొనసాగుతుందన్నారు. ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులుగా డాక్టర్ ఆరిగేల అశోక్, హరి అశోక్ కుమార్, కందుకూరి రవి బాబు, బైరం హరికిరణ్, న్యాయవాది జంగిలి మల్లికార్జున్, కొలగాని శ్రీనివాస్, సాయిని పాపన్న, చెదలు సత్యనారాయణ, పడాల తిరుపతి, గంగం జలజను ప్రకటించారు.





# గంగమ్మ తల్లికి బోనాలు

**తెలంగాణ ప్రభ (కోరుట్ల) :** జగిత్యాల పట్టణ స్థానిక వాణినగర్ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గంగమ్మ జాతర బోనాల మహోత్సవంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్ బోగ శ్రావణి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి ఆముద రాజు, సిరికొండ రాజన్న,జిల్లా మహిళ మోర్చా ప్రధాన కార్యదర్శి సాంబరి కళావతి, జిల్లా కార్యవర్గ సభ్యులు బద్దెల గంగరాజాం,పవన్ సింగ్,రాజేందర్, రాపర్తి రాజు, చిట్యాల రమేష్, ఇట్యాల రాము, ఉట్నూరు నరసింహ, ఆరుముళ్ళ ఉమేందర్, రవి వర్మ, కట్కూరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# మున్నూరుకాపు సంఘం జిల్లా ప్రచార కార్యదర్శిగా బాల్‌రెడ్డి

**తెలంగాణ ప్రభ (ఎల్లారెడ్డిపేట) :** రాజన్న సిరిసిల్ల జిల్లా మున్నూరు కాపు సంఘం ప్రచార కార్యదర్శిగా బండారి బాల్‌రెడ్డి, జిల్లా కోశాధికారిగా బండలింగంపల్లికి చెందిన తడకల దేవరాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా ఎన్నికల అడ్‌హాక్ కమిటీ అధ్యక్షుడు అగ్గి రాములు తెలిపారు. నియామక పత్రాలను రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య, రాజన్న సిరిసిల్ల జిల్లా నూతన అధ్యక్షులు బొప్పా దేవయ్య, జిల్లా ప్రదాన కార్యదర్శి శంకర్, జిల్లా అడ్ హాక్ ఎన్నికల కమిటీ అధ్యక్షులు అగ్గి రాములు కలిసి అందజేశారు.



# ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి

**తెలంగాణ ప్రభ (కుత్బుల్లాపూర్) :** గాజుల రామరం డివిజన్ సర్వే నంబర్ 343లో ఉన్న 5 ఎకరాల భూమిని కేఎల్ యూనివర్సిటీకి కేటాయిస్తున్నారని తెలియడంతో ఆ భూములను పేదలకు పంచాలని తహసీల్దార్ కార్యాలయంలో సీపీఐ రాష్ట్ర నాయకులు ఏసురత్నం, నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇండ్లు లేని నిరుపేదలకు 60 గజాల స్థలం ఇవ్వమంటే అరెస్టు చేయించే అధికారులు, కోట్లాది రూపాయల వ్యాపారంచేసే వారికి స్థలం కేటాయించడం దుర్మార్గమన్నారు. అలాంటి నిర్ణయం తీసుకుంటే వెంటనే ఉపసంహరించుకోవాలని వినతిపత్రంలో డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మరోసారి భూపోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ కార్యవర్గ సభ్యులు హరినాథ్ రావ్, శ్రీనివాస్, రాములు, శాఖ నాయకులు ప్రభాకర్ పాల్గొన్నారు.

# ప్రభుత్వం ఉన్నట్టా..? లేనట్టా..?



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- సర్కార్‌పై ఎక్స్ (ట్విటర్) వేదికగా మండిపడిన మాజీ మంత్రి
- కాంగ్రెస్ రైతులను విస్మరించింది
- రైతుల సంఘటిత శక్తిలో ఉన్న బలాన్ని.. చవిచూడక తప్పదు

**తెలంగాణ ప్రభ, హైదరాబాద్ :** తెలంగాణలో ప్రభుత్వం ఉన్నట్టా? లేనట్టా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ (ట్విటర్) వేదికగా ప్రశ్నించారు. విత్తనాల కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. 'రాష్ట్రంలో ప్రభుత్వం ఉన్నట్టా..? లేనట్టా..? విత్తనాల కోసం రైతులకు ఏమిటీ వెతలు ?? పర్యవేక్షించాల్సిన వ్యవసాయ మంత్రి ఎక్కడ ? ముందుచూపు లేని ముఖ్యమంత్రి జాడేది ?? ఎన్నికల ప్రచారంలో తిరగడం తప్ప.. ఎన్ని ఎకరాలకు విత్తనాలు అవసరమో లెక్కలేదా ?? నిన్న.. ధాన్యం అమ్ముకుందామంటే కొనేటోడు లేడు..! నేడు.. విత్తనాలు కొందామంటే అమ్మేటోడు లేడు..!! పాలన పూర్తిగా పడకేసిందని చెప్పడానికి.. ఇంతకన్నా నిదర్శనం ఇంకేం కావాలి ?? సాగునీళ్లు ఇవ్వడం చేతకాక పంటలు ఎండగొట్టారు.. ఇప్పుడు విత్తనాలు అందించే విజన్ కూడా లేదా ?? తెల్లవారుజామున 4 గంటలకు లైన్ లో నిలబడితే.. సాయంత్రం 4 గంటల వరకూ విత్తనాలు ఇవ్వలేరా ?? గత పదేళ్ల పాటు.. 10 నిమిషాల్లో అందిన విత్తనాలు.. 10 గంటలపాటు పడిగాపులు పడినా అందించలేరా ?? రంగారెడ్డి నుంచి.. కామారెడ్డి దాకా.. రైతులకు ఏమిటీ కష్టాలు.. ఇంకెన్నిరోజులు ఈ కన్నీళ్లు.. దేశం కడుపునింపే స్థాయికి ఎదిగిన తెలంగాణ.. అన్నదాతకే తిండితిప్పలు లేకుండా చేస్తారా ?? బీఆర్ఎస్ పాలనలో పండుగలా సాగిన వ్యవసాయాన్ని.. అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే ఆగం చేస్తారా ?? ఇప్పటికైనా.. సరిపడా విత్తనాల స్టాక్ తెప్పించండి..! బ్లాక్ మార్కెట్ కు తరలించకుండా కళ్లెం వేయండి..!! కాంగ్రెస్ వచ్చింది.. కాటగలిసినం అంటున్న.. అన్నదాతలను ఇంకా అరిగోస పెట్టకండి..!! లేకపోతే.. రైతుల సంఘటిత శక్తిలో ఉన్న బలాన్ని.. కాంగ్రెస్ ప్రభుత్వం చవిచూడక తప్పదు..!! జై కిసాన్.. జై తెలంగాణ' అని కేటీఆర్ ట్వీట్ చేశారు.



## ఎన్టీఆర్‌కి భారతరత్న ప్రకటించాలి

**తెలంగాణ ప్రభ (కోరుట్ల) :** నటరత్న, పద్మశ్రీ, మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు, నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా కోరుట్ల పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇంచార్జ్ మానుక ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలదండ వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలలలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి చరిత్ర సృష్టించారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2కిలో బియ్యం పథకం, జనతా వస్త్రాలు, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, గృహ నిర్మాణ పథకాలు, మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు, తెలుగు ప్రజలలో రాజకీయ చైతన్యం, బలహీన వర్గాలకు రిజర్వేషన్లు, ప్రజాసంక్షేమ కార్యక్రమాలు చేపట్టి చరిత్ర సృష్టించిన ఘనత ఎన్టీఆర్ అని ఆయన అన్నారు. నేషనల్ ఫ్రంట్ చైర్మన్‌గా దేశ రాజకీయాలలో చక్రం తిప్పి, తెలుగు ప్రజలకు ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు తెచ్చిన ఘనత ఎన్టీఆర్ సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గజ్జల్లి రాజ గణేష్, ఎనుగందుల శ్రీనివాస్, పాతర్ల విజయ్ కుమార్, బద్దం మోహన్, బాలే మారుతి, అంజయ్య, నజీర్, చిలువేరి మహేశ్వరి, విజయ, సబ్బాసుల శాంత, రాణి, లక్ష్మీ, దివ్య, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి ఆరోపణలపై బహిరంగ చర్చకు సిద్ధమా?

### కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్‌కి జువ్వాడి కృష్ణారావు సవాల్

**తెలంగాణ ప్రభ (కోరుట్ల) :** 'అవినీతిపై బహిరంగ చర్చకు వచ్చే దమ్ముందా.. సంజయ్ నీకు' అని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు సవాల్ విసిరారు. ఫోన్ టాపింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కల్వకుంట్ల కుటుంబానికి చెందిన కోరుట్ల శాసనసభ్యుడు కల్వకుంట్ల సంజయ్.. నీ కుటుంబం చేసిన అవినీతిపై అక్రమార్జనపై మీ తండ్రి కొడుకులు చేసిన మోసాలపై బహిరంగ చర్చకు సిద్ధమేనా అని నిలదీశారు. ఎమ్మెల్యే టికెట్ కోసం తండ్రి కొడుకులు గొడవపడి నువ్వు ఇంట్లో విధ్వంసం సృష్టించావని ప్రసార మాధ్యమాల్లో వచ్చిన విషయం ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు. కల్వకుంట్ల కుటుంబం అంటేనే అవినీతికి బ్రాండ్ అంబాసిడర్ల అన్నారు. కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ తన కుటుంబానికి సంబంధించిన అవినీతి ఆరోపణలపై ఎక్కడైనా బహిరంగ చర్చకువస్తే తాను అందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. నువ్వే బహిరంగ చర్చకు వేదిక.. సమయం నిర్ణయించు.. ఆ సమయానికి నేను మీ కుటుంబం చేసిన పూర్తి అవినీతి మోసాలకు సంబంధించిన పూర్తి సాక్షాధారాలను తీసుకొని వస్తానని కృష్ణారావు తేల్చి చెప్పారు.



## రఘునందన్‌రావు గెలుపు ఖాయం

### సంగారెడ్డి జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి స్రవంతి చంద్రగౌడ్



**తెలంగాణ ప్రభ (నర్సాపూర్) :** మెదక్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు గెలుపు ఖాయమని సంగారెడ్డి జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి స్రవంతి చంద్రగౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రధాన నరేంద్ర మోడీ చేస్తున్నటువంటి దేశ రక్షణతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను చూసి దేశవ్యాప్తంగా ప్రజలు భారతీయ జనతా పార్టీకి బ్రహ్మరథం పట్టారన్నారు. జూన్ 4వ తేదీనా వెలువడనున్న ఫలితాల్లో మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు భారీ మెజార్టీతో గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

## ఖాదీ కళావేదికను పునర్ నిర్మించాలి

**తెలంగాణ ప్రభ (కోరుట్ల) :** జగిత్యాల జిల్లా మెటుపల్లి పట్టణంలోని ఖాదీ ఆవరణలో గల తొలగించిన ఖాదీ కళావేదికను పునర్ నిర్మించాలని కళాకారుడు కోటగిరి వెంకటస్వామి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖాది గ్రామోద్యోగ్ సంస్థ ఏర్పడినప్పట నుంచి దశబ్దాల కాలంగా కళా రంగ వైభవాన్ని నలుదిశాల వ్యాప్తికి ఆధారమైన కేంద్ర బిందువైనా ఖాదీ నవీకరణలో భాగంగా తొలగించబడడం చాలా బాధాకరమన్నారు. పట్టణంలోని సకల ప్రముఖులు ఖాదీ ఆవరణలో యథావిధిగా కళావేదికతో కూడిన కళాప్రాంగణాన్ని నిర్వహించాలని ఆకాంక్షిస్తున్నారు. కార్యక్రమంలో మట్టెల గంగాధర్, సప్పరి శ్రీనివాస్, పరంకుశం నర్సయ్య, కోటగిరి చైతన్య, ఎండి షబీర్ హుస్సేన్, అందే మారుతి, రంగు శ్రీనివాస్, ఇల్లెందుల శ్రీనివాస్, ఎలిగేటి కృష్ణ, కవులు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## కనికరం లేని కొడుకులకు, కోడళ్లకు కౌన్సెలింగ్

**తెలంగాణ ప్రభ (కోరుట్ల) :** కన్న తల్లి, దండ్రులను పోషించక నిరాధరిస్తున్న కొడుకులు, కోడళ్లకు తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులు కౌన్సెలింగ్ ఇచ్చారు. తాము తమ తల్లిదండ్రులను పోషిస్తూ, బాగోగులు చేసుకోవడానికి సమ్మతించి ఒప్పంద పత్రం రాసిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అసోసియేషన్ కార్యాలయం కౌన్సిలింగ్ కేంద్రానికి ఆ కొడుకులు, కొడళ్లను ఆ తల్లిదండ్రుల అభ్యర్థనపై పిలిపించి వయోవృద్ధుల చట్టంపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులను పోషించక, నిరాదరణకు గురిచేస్తే ట్రిబ్యునల్ అధికారి ఆర్డీవో 3 మాసాలకు పైగా జైలు శిక్ష, జరిమానా విధించే వీలు ఆ చట్టంలో ఉందని హెచ్చరించారు. కాగా, అసోసియేషన్ గౌరవ సలహాదారు మాజీ మున్సిపల్ చైర్మన్ జీ.ఆర్.దేశాయ్, ప్రతినిధులు గౌరిశెట్టి విశ్వనాథం, వి.ప్రకాశ్ రావు, పట్టణ అధ్యక్షుడు సీనియర్ న్యాయవాది పి.సతీశ్ రాజ్, యాకూబ్ కొడుకులు, కోడళ్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ కౌన్సిలింగ్‌లో ఉపాధ్యక్షులు బొల్లం విజయ్, ఇక్బాల్, సంఘం పట్టణ అధ్యక్షుడు సతీశ్‌రాజ్, సింగం గంగాధర్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

## లయన్స్‌క్లబ్, కోటి నవదుర్గ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**తెలంగాణ ప్రభ (కోరుట్ల) :** లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల, కోటి నవదుర్గ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని జోన్ చైర్మన్ లయన్ అల్లాడి శోభ ప్రవీణ్ సౌజన్యంతో కోరుట్లలోని స్థానిక వాసవి కళ్యాణ భవనం నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం 108 మందికి ఉచితంగా వైద్య సేవలు అందించారు. సుమారు రూ.60 వేలతో వివిధ రకాల మందులు కూడా పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వనపర్తి చంద్ర మోహన్ – రమ్య, కుందారపు మహేందర్ – ప్రేమలత, ట్రెజరర్లు కొండబత్తిని కృష్ణ ప్రసాద్ – రాధిక పాల్గొన్నారు. మన డాక్టర్ల బృందం క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ లయన్ డాక్టర్ దిలీప్ రావు, ఐఎంఏ మాజీ అధ్యక్షులు డాక్టర్ అనూప్ రావ్ – డాక్టర్ స్వీతి, లయన్ డాక్టర్లు రేగొండ రాజేష్, రేగొండ ప్రియాంక, డాక్టర్ గండ్ర అన్వేష్ – డాక్టర్ శృతి, డాక్టర్ ఒడ్నాల నరేష్ వైద్య సేవలు అందించారు.



# 'పుష్ప-౨' నుంచి రెండో సాంగ్ వచ్చేసింది!

'సూసేకి అగ్గిరవ్వ మాదిరి
ఉంటాడే నా సామి..' అంటూ సాగే పాట
ఆలపించిన ప్రముఖ గాయని శ్రేయా ఘోషల్
చంద్రబోస్ లిరిక్స్.. దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్
అల్లు అర్జున్, సుకుమార్ కాంబోలో 'పుష్ప-2'

అల్లు అర్జున్, సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న భారీ సీక్వెల్ 'పుష్ప-2'. ఆగస్టు 15న ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమా విడుదలకు ముందే, తొలిపాట విడుదలై రికార్డులు సృష్టించింది. 'పుష్ప పుష్ప' సాంగ్, స్టెప్ బాగా వైరల్ అయింది. ఇప్పుడు రెండో పాటను కూడా చిత్రం యూనిట్ తాజాగా విడుదల చేసింది. 'సూసేకి అగ్గిరవ్వ మాదిరి ఉంటాడే నా సామి..' అంటూ సాగే ఈ కపుల్ సాంగ్ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ పాటకు సంగీతాన్ని దేవిశ్రీ ప్రసాద్ అందించగా, లిరిక్స్ చంద్రబోస్ రాశారు. శ్రేయా ఘోషల్ పాడారు. అల్లు అర్జున్ మరియు హీరోయిన్ రష్మిక మందన్నపై చిత్రీకరించిన ఈ పాట, సోషల్ మీడియాలో అభిమానులను ఆకట్టుకుంటోంది. పుష్ప-2 సినిమా పట్ల ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. ఇక పుష్పతో పాన్ ఇండియా హిట్ కొట్టి భారీ వసూళ్లతో అదరగొట్టిన బన్నీ.. నేషనల్ అవార్డు సాధించాడు. ఇప్పుడు 'పుష్ప-2'తో ఇంకెన్ని రికార్డులు సాధిస్తాడో చూడాలి.

